మనసొంపుగా



**ఆలయంలో గంటలు, పూజారిగారి మంత్రోచ్ఛారణ మనసును ఆహ్లాదపరుస్తున్నాయి. ఆలయ మంటపంలో ఒక స్థంభం ప్రక్కనే కూర్చున్న నాకు అక్కడి వాతావరణం మాటలకందని ప్రశాంతతను అందిస్తోంది. నా జీవితంలో అతి ముఖ్యమైన కొన్ని నిర్ణయాలను ఇలా ఆలయ ప్రాంగణంలోనే తీసుకున్నాను. ఈరోజూ అందుకే వచ్చాను.**

# తొందర పడని కోయిల

గత మూడు రోజులుగా మనోవేదనకు గురిచేసిన సమస్యకు ఇప్పుడే పరిష్కారం గోచరించింది. అంతర్మథనం వల్ల కల్లోలమైన మనసు ఇప్పుడు శరద్కాల పండువెన్నెల చల్లదనాన్ని ఆస్వాదిస్తోంది.

మెల్లగా లేచి విశాల్ ఇంటివైపు పయనం సాగించాను. విశాల్!! సంవత్సరం క్రితం పరిచయమైన విశాల్ నాలో ప్రేమను చిగురింపచేశాడు. నాతో ఎన్నో ప్రేమగీతాలు ఆలపించాడు. ప్రేమకబుర్లు చెప్పాడు. ప్రణయ గాధలలోని మాధుర్యాన్నంతా విశాల్ సాన్నిహిత్యంలో మనసారా ఆస్వాదించాను. అనుదినం అనుక్షణం మదిలో విశాల్ రూపమే. విశాల్ అంతగా అంతరాంతరాలలో సుస్థిరమైపోయాడు.

అటువంటి విశాల్ వారం క్రితం చెప్పిన మాట నాలో తుఫాను రేపింది.

'మా ఇంట్లో పది రోజులుగా గొడవ జరుగుతోంది'

'దేని గురించి?'

'నా పెళ్ళి గురించి'

'అందుకు గొడవెందుకు? మనిద్దరి సంగతి మీ ఇంట్లో తెలుసన్నావుగా?!

'ఆ... ఆ... తెలుసు. కాని వాళ్ళు మన ప్రేమని సీరియస్‌గా తీసుకోవడంలేదు. నా మాటని అస్సలు పట్టించుకోవడంలేదు.'

'అంటే?'

'అంటే... అదే నీకుముందసలు చెప్పకూడదనే అనుకున్నాను. నేనెలాగూ మధనపడుతున్నాను. మళ్ళీ నిన్నెందుకు బాధపెట్టడం అనిపించింది. సరే వదిలేయ్. మరేదైనా మాట్లాడుకుందాం'

'అది కాదు విశాల్. ఏం జరిగిందో చెప్ప నాకూ తెలియాలిగా?

'వదిలేయ్‌మన్నానుగా! నా తిప్పలేవో నేను పడతాను. మన పెళ్ళి మాత్రం ఖాయం. ఓ.కే. దాన్ని ఎవరూ అడ్డుకోలేరు.'

'అంటే... మన పెళ్ళికి మీ వాళ్లు అంగీకరించడం లేదా?'

'అబ్బబ్బ. ప్లీజ్. ఏదో నోరుజారాను. నీకసలు చెప్పకుండా వుండాల్సింది.'

'విశాల్! మన మధ్య దాగుడు మూతలు పనికిరావు. ఏం జరిగిందో ఫ్రాంక్‌గా చెప్ప'

రెండుక్షణాల తర్వాత విశాల్ మొదలెట్టాడు.

చాలాసేపు చెప్పాడు. ఇంట్లో వాళ్ళతో తన వాదోపవాదాలు, కలతలు, బెదిరింపులు, నిర్ణయాలు. ఇంక ఏవేవో. సంక్షిప్తంగా ఆ మాటల్లో సారాంశం ఒక్కటే. విశాల్‌కు మరో అమ్మాయితో పెళ్ళి నిశ్చయం చేయబోతున్నారు. ఆ అమ్మాయి అందచందాలలో, ఆస్తిపాస్తులలో అన్నిటా నాకంటే ఎంతో మెరుగైనది. ఆ అమ్మాయిని చేసుకుంటే విశాల్ కెరీర్ అద్భుతంగా వుంటుంది. అందుకే ఇంట్లో వాళ్ళంతా విశాల్ మనసు మార్చడానికి శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నారు.

'చివరికి నీవేమన్నావ్?'

'అనేందుకేముంది? నా మనసుకు నచ్చిన అమ్మాయిని కాకుండా మరో అమ్మాయిని చేసుకోనని తెగేసి చెప్పేశాను' అని మరి రెండుక్షణాల తర్వాత

'చూద్దాం.. ఏం జరుగుతుందో!' అన్నాడు.

విశాల్‌వంక చూస్తూ అతని మనసులోని భావాన్ని చదవడానికి ప్రయత్నించాను.

ఆ మర్నాడు...

విశాల్ చాలా సీరియస్‌గా ఏదో ఆలోచిస్తున్నట్టు కనిపించాడు. అతన్ని చూసి నేను మౌనంగా వుండిపోయాను. కొద్దిసేపయిన తర్వాత విశాల్ తనలో తాను గొణుక్కుంటున్నట్టు అన్నాడు.

'ఛ... ఏం మనుషులు!... ఛ...'

'....'

'రాత్రి కూడా మా ఇంట్లో బాగా గొడవ జరిగింది. ఆ అమ్మాయిని చేసుకోవాల్సిందేనని వాళ్ళకి మాటిచ్చేశామని, ఆ అమ్మాయిని చేసుకోకపోతే పరువుపోతుందని అంటున్నారు. నన్ను మాటల్తో బంధించేస్తున్నారు.'

'నీ పరువు కోసం మన ప్రేమను వదులుకుంటావా?'

సూటిగా ప్రశ్నించాను. క్షణం సేపు విశాల్‌లో తత్తరపాటు.

'నేనలా అన్లేదే? మన ప్రేమ గురించి నేను పట్టుపట్టడం వల్లనే గొడవ జరుగుతోంది. నేనెంతగా నచ్చచెప్పబోయినా వాళ్ళు వినడంలేదు. అందరూ కలసి నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.

మరి రెండు రోజుల పాటు విశాల్ తన ఇంటిలోని గొడవ గురించి చెప్పాడు. తనను నిస్సహాయుడ్ని చేస్తున్నారని, తన మాటకు విలువ ఇవ్వడంలేదని చెప్పాడు. అయినా నన్ను, నా ప్రేమను వదులుకోలేనన్నాడు. చివరికి ఏం చేయాలో చెప్పమని నన్నే సలహా అడిగాడు. మనిద్దరం కలసి గుళ్ళో పెళ్ళిచేసుకుందామన్నాను. రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుందామన్నాను. ఇద్దరం కలసి ఇద్దరి తరవున పెద్దవాళ్ళని ఒకచోట కూర్చోబెట్టి మాట్లాడిద్దామన్నాను. ఇలా ఎన్నో చెప్పాను. కాని విశాల్ గొడవలకు, వివాదాలకు దూరంగా అందరినీ ఒప్పించి, మెప్పించి పెళ్ళిజరగాలన్నాడు.

ఇది జరిగి మూడు రోజులైంది. ఈ మూడు రోజులుగా నాలో ఎన్నో తుఫానులు, అలజడులు, అగ్నిపర్వతాలు. చివరికి ఒక నిర్ణయానికి వచ్చాక మనసు తేలికపడింది. విశాల్ ఇల్లు చేరుకున్నాను.

అప్పడే హడావుడిగా బయటికి వెళ్ళబోతున్న విశాల్ నన్నుచూసి ఆగిపోయాడు. బహుశా నన్ను ఆ క్షణంలో అక్కడ ఊహించి వుండడు.

'ఏమిటంత కంగారు పడ్డావ్? నన్ను చూసేనా?'

'భలేదానివే. నిన్నుచూసి కంగారెందుకు? దా... దా... కూర్చో నిన్నా, మొన్నా కలుద్దామంటే కుదరలేదు' అంటూ కుర్చీ చూపించాడు.

'ఇంట్లో అంత పెళ్లి కళ వచ్చేసినట్టుందే' అన్నాను నాలుగు వైపులా పరికించి చూస్తూ.

'నిన్నీ ఇంటిలో పెళ్ళికూతురిలా చూడాలని ఎంతో అనుకున్నాను' అన్నాడు.

'అంటే... ఇప్పుడు నన్ను పెళ్ళిచేసుకోవా?' సూటిగా అడిగేశాను.



**ముందుజాగ్రత్త**

ఐశ్వర్యారాయ్, మనీషాల కామన్ ఫ్రెండు జాకీ ష్రాఫ్ ఆమధ్య ఒక ఇంటర్వ్యూలో ఐశ్వర్యాను, మనీషాను ఆకాశానికెత్తేసాడు. కానీ నోరుజారి మనీషాలో సంథింగ్ స్పెషలుంది అన్నాడు. ఇప్పుడు నాలుక కరుచుకుని ఐశ్వర్యారాయ్ కు తెగ ఫ్లవర్ బొకేలు పంపుతున్నాడు.

'అబ్బే అలా అని కాదు. చెప్పాగా. కొద్ది రోజులాగు. మా వాళ్ళని మనదారిలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నా' అన్నాడు మెల్లగా.

నేను సూటిగా అసలు విషయంలోకి వచ్చేశాను.

'విశాల్! నేను ఆల్‌రెడీ ఒక నిర్ణయానికి వచ్చేశాను. అది చెబుదామనే సరాసరి మీ ఇంటికి వచ్చేశాను.' అన్నాను.

విశాల్ ముఖంలో చాలా రంగులు మారాయి. నేనేం చెబుతానోనని ఊపిరి బిగబట్టి నావంకే చూస్తున్నాడు. అతని స్థితి గమనించాకనేను తీసుకున్న నిర్ణయం సరైనదేననిపించింది. అందుకే వెంటనే చెప్పేశాను.

'విశాల్. నన్ను మరచిపో. నీ బంగారు జీవితం పాడుచేసుకోకు. మన ప్రేమకు ఫుల్‌స్టాప్ పెట్టేసి ఆ అమ్మాయితో పెళ్ళికి ఒప్పేసుకో' అన్నాను ప్రతి మాట ఒత్తిపలుకుతూ. విశాల్ నోటమాటరాలేదు. తన ముఖంలో పెల్లుబుకుతున్న భావాల్ని దాచుకోవడానికి ప్రయత్నించాడు.

'నువ్వు చాలా టెన్షన్‌లో వున్నట్టున్నావ్. రిలాక్స్ అవు. ఏం తీసుకుంటావ్' అన్నాడు విశాల్.

'ఏమీ వద్దు. నేను తీవ్రంగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాను. నీ జీవితానికి అడ్డురాకూడదనుకున్నాను. మనం ఇక నుంచి జస్ట్ ఫ్రెండ్స్. అంతే. ఓ.కే. మళ్లీ కలుద్దాం. నీ పెళ్ళి శుభలేఖ మాత్రం నాకు తప్పనిసరిగా ఇవ్వాలి. నువ్వు పిలవకపోతే రాను. ఓ.కే. వస్తాను' అనేసి చకచక బయటికి వచ్చేశాను.

ఇదేదో విశాల్ కోసం నా ప్రేమను త్యాగం చేశాననుకుంటే పొరపాటే. నాకు తెలుసు నా నిర్ణయం విశాల్‌ను ఎంతో ఆనందింపజేస్తుందని. ఇక నన్ను కలుసుకోడని. విశాల్ మనస్తత్వాన్ని బాగా ఆకళింపు చేసుకున్న తర్వాత అతడు నాకు తగడనిపించింది. అతడొక అవకాశవాది. పైకి చాలా మంచివాడుగా కనిపిస్తాడు. అందరిలో తాను మంచివాడుగా మిగిలిపోవాలి అనుకుంటాడు. అదే సమయంలో తాననుకున్నది సాధించాలనుకుంటాడు. మెత్తగా మాట్లాడుతూ తనకు కావలసింది ఎదుటివారి చేతే చెప్పించగల ఘనుడు. చాలా సందర్భాలలో అతని నైజం బయటపడింది. కాని చివరికి ప్రేమను కూడా ఇలా లాభనష్టాలతో బేరీజు వేసుకుంటాడని మాత్రం ముందుగా ఊహించలేకపోయాను. అదే నేను చేసిన పొరపాటు. అందుకే చేతులు కాలకముందే నా పొరపాటుని సరిదిద్దుకున్నాను. అతని దృష్టిలో మనసుకు విలువలేదు. అతనికి తనకంటూ ప్రత్యేక వ్యక్తిత్వం లేదు. అవకాశాన్ని బట్టి అభిప్రాయాలు మార్చుకుంటూ నడుచుకోవడం, మనసుకు ముసుగేయడం అతని ప్రవృత్తి. అందుకే నేను అతనితో పోట్లాడకుండా అతని స్టయిల్‌లోనే నవ్వుతూ మెత్తగా సమాధానం చెప్పేశాను.

ఈ మూడు రోజులలోనూ అతని అంతఃస్వరూపాన్ని పరిశీలించిన తర్వాత నాకు అర్థమైంది ఒక్కటే. అతనిపై నాకున్న విశ్వాసాన్ని అతడు దెబ్బతీశాడు. నిజంగా నాపైనే ప్రేమ వుంటే దాన్ని నిలబెట్టుకోవాలనుకుంటే నన్ను ఇన్ని రోజులుగా 'మెంటల్'గా ప్రిపేర్ చేయాల్సిన అవసరం లేదు. తన పెళ్ళి సమస్యని నా ముందు పెట్టి నన్ను పరిష్కరించమని అడిగేవాడు కాదు. అటువంటి వ్యక్తితో జీవితాన్ని పంచుకుంటే నేను జీవితాంతం బాధపడాల్సి వచ్చేది. ఏదో ప్రేమించాను. ప్రేమ గుడ్డిది కదా! అందరూ మామూలు పరిస్థితులలో బాగానే వుంటారు. కాని క్లిష్ట సమయంవచ్చినప్పుడు వారి అసలు స్వరూపం బయటపడుతుంది. విశాల్ విషయంలో అదే జరిగింది. అందుకే అతని విషయంలో నన్ను ముందుగా మేలుకొలిపినందుకు ఆ దేవుడ్ని మనసులోనే నమస్కరించాను.

—'మోతీలాస్య'